చెప్పిన మూడొంతులమంది. మిగతా ఒక వంతు మంది మాత్రం మొహాలు ఇబ్బందిగా పెట్టారు సుందరం తమని టార్గెట్ చేయడంతో.

సుందరం కొనసాగించాడు. "అప్పు ఇచ్చిన వాడెవడైనా అప్పు తీసుకున్న వాడి చేతిలో డబ్బు లేనంతకాలం వడ్డీతో సరిపుచ్చుకుంటాడు. చేతిలో పెద్ద మొత్తం పెట్టుకుని బాకీ తీర్చకపోతే 'అసలు' మొండి బాకీగా ఎక్కడ స్థిరపడిపోతుందో అని కంగారు పడతాడు. ప్రస్తుతం బ్రహ్మానందాన్ని కూడా అదే వేధిస్తోంది. కాబట్టి నే చెప్పొచ్చేదిమిటంటే..ఎప్పుడు ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ఆదుకునే బ్రహ్మానందాన్ని బాధపెట్టడం భావ్యం కాదు. కాబట్టి వాయిదా వేయకుండా అందరం బ్రహ్మానందం అప్పు అసలీఫాయిదాలతో సహా తీర్చేస్తే బ్రహ్మానందం రిలాక్స్ అయిపోతాడు. అవసరమైన వాళ్ళు కావాలనుకుంటే మళ్ళీ అడిగితే బ్రహ్మానందం లేదనడుగా" అన్నాడు.

సుందరం సలహా ఆ ఒక వంతుమంది మీద పనిచేసింది. వాళ్లు కూడా బ్రహ్మానందం బాకీ తీర్చివేయడానికే నిశ్చయించుకున్నారు.

కేంటీన్ నుండి తిరిగివస్తూ స్టాఫ్ రూమ్‌లో తన ప్రస్తావన వినిపించి గుమ్మం బయటనే నిలబడి ఈ మాటలు విన్న బ్రహ్మానందం తనలో తనే విరక్తిగా నవ్వుకుంటూ సీట్లోకొచ్చి కూలబడ్డాడు. ఇప్పుడు ఉదయం కంటే మరింత డీలాపడిపోయాడు.

నిన్న మూడొంతులమంది బాకీ తీర్చేస్తామని చెప్పగానే మూడొంతుల మూడ్ పాడయిన బ్రహ్మానందంకి ఈ రోజు మిగతా ఆ ఒక వంతు మంది కూడా తీర్చేయడానికి సిద్ధపడుతుండటంతో మొత్తం మూడ్ పాడయింది.

ఔను మరి..!

మొత్తం స్టాఫ్ తన బాకీ చెల్లించేస్తే మొత్తం లక్షా ముప్పై వేలు చేతికందుతుంది. ఆ మేరకు నెల నెలా తనకు ఏమాత్రం కష్టం లేకుండా (వసూలు విషయం), క్రమం తప్పకుండా, ఠంచనుగా ముట్టే 'వడ్డీ'కి గండి పడుతుంది. తత్ఫలితంగా వాటిల్లబోయే నష్టం చిన్నదేమీ కాదు. వేలల్లో మాట. అంత పెద్ద మొత్తంలో సైడు సంపాదన కాస్తా ఒక్కసారిగా 'హరీ'మంటుంటే బ్రహ్మానందానికే మిటి ఎవరికైనా దిగులే మరి!

**-జె.ఎం.ఫిన్‌లె** (సికింద్రాబాద్)

# కోటివిద్యలూ కూటికోసమే


అది ఒక ఫ్యాక్టరీ కాలనీ. ఒకరోజు మధ్యాహ్నం భోజనాలు చేసి వెళుతున్న భర్తలని సాగనంపుతూ, వాళ్ళ వాళ్ళ కాంపౌండ్ గేట్ల దాకా వచ్చి, నిలుచున్నారు ఆడవాళ్ళు. ఒకరినొకరు పలకరించుకుంటూ. కాసేపు బయటే నిలుచున్న, ఆ పడతుల కబుర్లను, ఒక ఆడమనిషి ఆక్రందనలు ఆటంకపరిచాయి.

"అమ్మా! అయ్యా! ఎవరైనా ఆ పున్నాత్ముడి ఆచూకీ సెప్పి పున్నెం కట్టుకోండి తల్లే! నాబిడ్డ సావుబతుకుల్లో ఉందమ్మా, ఆదొర మందిస్తే తప్ప, నా బిడ్డ దక్కదు తల్లీ.." అంటూ ఒక స్త్రీ ఏడుస్తూ, వాళ్ళ ముందు కొచ్చింది.అప్పటికే అక్కడున్న వారంతా, ఆ దీనాలాపనకి కరిగిపోయారు. ఈ మనిషికి వచ్చిన కష్టం ఏమిటి? ఈమె వెతుకుతున్న ఆ పుణ్యాత్ముడెవరు? అంటూ జాలిగా ఆమెను చూస్తూ ఉండిపోయారు.

అందరూ తన చేత ఆకర్షింపబడ్డారని గ్రహించగానే మళ్ళీ శోకాలు పెట్టిందామె. "అమ్మా ఓ పాలి నాపెద్దబిడ్డకి వల్లు బాగోకుండా పోనాది. ఏ డాకటేర్లు బాగు సేయలేదు. ఎవురో దర్మాత్ములు, ఈ కోయదొర గురించి సెప్పి, పున్నెం కట్టుకున్నారు. ఆ దొరకాడికి బిడ్డనట్టుకెల్లినా. ఆ సామి - ఆ దొర - ఆ దేవుడు నా బిడ్డ సెయ్యి సూసి, దోసం సెప్పి, ఏవో మూలిక లిచ్చిండు. నాగపూజ సేయమని సెప్పిండు. అంతేనమ్మా! మీరు నమ్ముతరో నేదో తల్లీ..బిడ్డ బతికి బట్టకట్టినాది. ఇప్పుడు నా సిన్నబిడ్డకి వల్లు బాగోనేదు. ఆసామి కాడ కెల్లినా. ఆ అయ్య సంచారానికి ఇటుకేని వచ్చినాడని సెప్పినారు. అందుకే ఇల్లిక్కడకు లగెత్తుకొచ్చినా" ఏడుపు ఆపి కాస్త ఊపిరి పీల్చుకుందామె.

"అసలు ఆ దొర ఎవరు? ఇటెందుకు వచ్చాడు?" అని అడిగింది ఒకావిడ. నిజానికి ఆ దొర గురించి తెలుసుకోవాలనే ఆశ అక్కడున్న అందరిలోనూ కలిగింది.

ఇది గమనించేసింది ఆ స్త్రీ. "ఆ కోయదొర గురించి ఎంతని సెప్పను తల్లీ...మా దొడ్డమారాజు. సెయ్యి సూసి జరిగింది, జరుగబోయేది అంతా సెప్తడు. పరోపకారం సేసే దొడ్డమనసున్న మారాజు, ఊరూరా తిరుగుతా పెజాసేవ సేత్తడు. ఆ సామిని మీరు గనుక సూత్తే సెప్పండమ్మా" అంటూ అందరి గడ్డాలు పట్టుకుని ప్రాధేయపడింది.అంతటి శక్తిసామర్థ్యం గల ఆ దొరని చూడాలని అందరికీ ఆత్రుతగా ఉంది. ఎప్పుడూ కీళ్ళనొప్పులతో బాధపడే కనకమ్మగారూ, వయసు ముదిరిన కూతురి పెండ్లి విషయం తెలుసుకోవాలన్న ఆశతో కాంతమ్మ,



భర్తకి రావలసిన ప్రమోషను వెనక్కి పోవడానికి ఏ దోషం అడ్డు వస్తుందో, అడగాలని ఆదిలక్ష్మి కొడుక్కి ఉద్యోగం ఎప్పుడు వస్తుందో కనుక్కోవాలనే ఆశతో సావిత్రమ్మ, అందరూ కోయదొర కోసం ఎదురు చూడసాగారు. ఇలా వీళ్ళందరిలోనూ ఆశలు కలిగించి, ఆ దొరని వెతుక్కుంటూ మరో వీధికి వెళ్ళిపోయింది ఆ స్త్రీ.

సాయంత్రం సమయం మూడు కావచ్చింది. "కొండకోనల వాడిని, కొండదొరని, రామసెంద్రుని భక్తుడ్ని, కానున్న కష్టం సెప్పి, ఆదుకోమని సెప్పె కోదండరామయ్య. రానున్న గండాలు సెప్పి కావమని సెప్పె, సీతమ్మ తల్లి" అంటూ తుంబుర మీటుతూ కంచుగంటలా మ్రోగుతున్న కంఠంతో పాటలా సాగదీస్తూ వచ్చాడు కోయదొర.

అతన్ని చూడగానే "అచ్చం సినిమాలో కోయదొరలాగే ఉన్నాడు. వేషం కలర్‌ఫుల్‌గా ఉంది. ఈసారి ఫ్యాన్సీ డ్రెస్ పోటీలకు ఈ వేషం వేస్తే భలేగా ఉంటుంది" అంటూ అతని చుట్టూ తిరుగుతూ శ్రద్ధగా పరిశీలించాడు మా తమ్ముడు.

ఇంతలో బిలబిలమంటూ ఆడవారంతా వచ్చారు. ఆ కోయదొరని చూసి, ఆపద్బాంధవుడిని చూసినంతగా సంతోషపడ్డారు. అతనితో గంటన్నర సేపు కాలక్షేపం చేసారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క దోషం అంటకట్టించుకుని, రకరకాల మూలికలు చూర్ణాలు అందుకుని తెచ్చిన డబ్బును వస్త్రాలను అర్పించుకున్నారు.

అదంతా గమనిస్తున్న నాకు ఎంచేతో ఆకోయదొరనీ, ఇతన్ని వెతుక్కుంటూ, అంతకుముందు వచ్చిన ఆ స్త్రీని, నమ్మబుద్ధి కాలేదు. మా తమ్ముడిని ఆ కోయదొరని అనుసరిస్తూ వెళ్ళమని చెప్పాను.

రెండు గంటల తరువాత, మా తమ్ముడు వచ్చి కడుపుబ్బేలా నవ్వాడు. వారిద్దరి విషయంలో, నేనూహించింది నిజమే అయ్యింది. మా కాలనీకి అవతల ఉన్న గ్రామదేవత గుడి అరుగు మీద కూర్చుని, ఆరోజు సంపాదన లెక్క పెట్టుకుంటున్నారట వాళ్ళిద్దరూ.

నిజానికి వాళ్ళు మోసగాళ్ళు కాదు. కోటి విద్యలూ కూటి కోసమే అని అంటారు కదా. ఆ కోయవాళ్ళు పబ్బం గడవాలంటే, వాళ్ళ దగ్గరున్న మూలికలూ-వేరులూ అమ్ముడవ్వాలి. అవి అమ్ముడవ్వాలంటే, ఆ మూలికల ప్రాముఖ్యత ప్రజలకు తెలియాలి. అంచేత ఆ స్త్రీ ముందుగా వచ్చి కోయదొర గొప్పదనాన్ని చెప్పి, ఆడవారందరిలోనూ, ఆ కోయదొరని చూడాలనే ఆశని కలిగించింది.

పెద్ద పెద్ద వ్యాపారస్థులు వ్యాపార ప్రకటనల ద్వారా తమ ప్రొడక్ట్స్ గొప్పదనాలను, చిలువలు-పలువలుగా వర్ణించి చెపుతూ ప్రజలని ఆకర్షించడం లేదూ..ఇదీ అలాంటిదే అనిపించింది. చదువుకోకపోయినా జనాన్ని ఆకర్షించేందుకు వారి పద్ధతి వారిది.

**-ఇ.రాజ్యలక్ష్మి** (సికింద్రాబాద్)